

# పసిడిమనసులు - షర్మిల



### నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# పాలపిట్ట రంగు చీర

రోజూకు మల్లేనే ఆవాళ పొద్దున్న నాయనమ్మ దొడ్లో మొక్కలకి పాదులు తవ్వుతూ, దారిలో వచ్చే పోయే వాళ్లని పిలిచి మరీ కబుర్లాడతాంది. "ఏంటక్కయ్ ! ఎక్కడికి ప్రయాణం? " అనో , "అబ్బాయ్ కూచిపూడి సెంటర్ కేనా? వెళ్తే కాస్త కాఫీ పొడి తెచ్చిపెడతావా? " అనో దారిన పోయే ఏ ఒక్కళ్లనీ వదలకుండా పలకరిస్తానే వుంది. చిట్టెమ్మ అంటే వూళ్లో అందరికీ ఇష్టమే. పెద్దాళ్లతోనూ, చిన్నాళ్లతోనూ కలిసిపోతందని అంతా అంటారు.

"అదిగో ! బెజవాడ బస్సు ఆగింది ఎవరింటికో చుట్టాలు" అనుకుంటూ ఆరాగా చూసింది. మా దొడ్లో నుంచి చూస్తే బస్సు దిగి వచ్చే వాళ్లు కనిపిస్తానే వుంటారు. మా రాజమ్మ పెద్ద సంచి మోసుకుంటా వస్తాంది.

"కోటేసూ! రాజమ్మ అక్కాయ్ చేతిలో సంచి అందుకో అంటూ పురమాయించింది నాయనమ్మ .

రాజమ్మ మా పెద్ద నాయనమ్మ. ఆవిడ ఇంటిపేరు బండి... బండి రాజమ్మ పేరుకు తగ్గట్టే నిండుగా వుంటుంది. చామనఛాయలో వుండే ఆమె నుదుటిన బొట్టు మెరిసే సూరీడల్లే పెద్దగా వుంటుంది.

రాజమ్మని చూడగానే పరిగెత్తుకుని వెళ్లి వాటేసుకున్నాను. ఆమె గంజిపెట్టి, ఇస్త్రీ చేసి కట్టుకున్న చీర కమ్మటి వాసన వచ్చింది. ఆమె నా తల నిమురుతూ తను తెచ్చిన పైసా బిస్కట్ల పేకెట్ ఇచ్చింది.

" ఏంటే అక్కాయ్ వున్నట్టుండి వచ్చావ్ " అంటా నాయనమ్మ నీళ్ల గ్లాసు అందించింది.

"అవునే ఆమధ్య నువ్వు బెజవాడ వచ్చినప్పుడు పాలపిట్ట రంగు చీర చూసి కావాలన్నవ్, తీరా అది అప్పటికే ఎవరో ఇచ్చేశానన్నాను కదా ! అట్టాంటి చీరే దొరికింది అందుకే తెచ్చా" అంది రాజమ్మ.

" సరేలే భోజనాలయ్యాకా స్వరాజ్యానిని ,సూరమ్మక్కాయిని మిగతా వాళ్లనీ చీరలు చూడడానికి రమ్మని కబురు చేస్తాలే" అంది నాయనమ్మ.

రాజమ్మ చీరలు అమ్ముతుంది. "బాధ్యత లేని భర్త ... మా అక్కే ఇంటి బరువు నెత్తిన వేసుకుంది, ఎవర్నీ చెయ్యి సాచి సాయం అడగదు" అని నాయనమ్మ అంటా వుంటుంది. రాజమ్మ ఎప్పుడు చూసినా లేసులు, వూలుతో రకరకాలు అల్లుతూనే వుంటుంది. అందరికీ వైరు బుట్టలు కావాలన్నా అల్లి ఇస్తుంది. ఆమె ఏ పని చేసినా ఎంతో అందంగా చేసేది. ఈసారి రాజమ్మ ఇక్కడ వున్నప్పుడు, దండ కావాలనగానే రంగురంగుల పూలతో దండ అల్లి ఇచ్చింది. ఆ దండ చూసిన మాస్టారు " ఎవరు అల్లారో గానీ ఈ రంగుల మేళవింపు అద్భుతం " అన్నారు. దాన్ని ప్రత్యేకంగా హేడ్మాస్టారి గదిలో సరస్వతీ దేవి పటానికి వేయించారు. నాకు ఏనుగెక్కినంత సంబరమైంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాకా తీరిగ్గా ఆడంగులంతా చీరలు చూడడానికి వచ్చారు. చీరలన్నీ పైకీ కిందకీ తిరగేశారు... పైట చెంగులన్నీ విప్పి చూశారు. అబ్బో ! "ఈ చీర ఎంత బాగుందో! కాకపోతే ఇదే రంగు గద్వాల చీర వుంద"ని ఒకరు, "పైట రంగు చీర రంగుకు

అతకలేద"ని ఒకరు, నానా వంకలు చెప్పి చివరికి ఎవరికీ చీరలు వద్దని తేల్చేశారు. దీంతో రాజమ్మ చీరలన్నీ జాగ్రత్తగా మడతలేసుకుని సంచిలో సర్దుకుంది.

వాళ్లు వెళ్లాక " ఇదుగోనే చిట్టీ నువ్వు కావాలన్న చీర" అని ఒక చీర తీసి బయట వుంచింది.

" ఏదీ!? " అంటూ నాయనమ్మ ఆ చీర చేతిలోకి తీసుకుంది. పాలపిట్టరంగుకి ఎర్ర మామిడి పిందెల బోర్డరుతో అందంగా వుంది. కానీ మా నాయనమ్మ మొహం అదోలా పెట్టి " అబ్బే నేను చూసిన చీర ఇట్టాంటిది కాదు, ఇది బులుగు రంగులో వుంటేనూ " అని పక్కన పడేసింది.

దీంతో రాజమ్మ ఖంగు తింది, "అదేంటే అట్టా అంటావు.. నేను పనిమాలా బెజవాడ నుంచి తెస్తే " అంటా వుండగానే నాయనమ్మ కస్సుమంటూ " చెప్పాగా ఈ చీర నాకు అక్కర్లేదని" అనేసింది.

రాజమ్మకి పౌరుషంతో కన్నీళ్లు వచ్చాయి. వెంటనే సంచి పట్టుకుని "నేను బయల్దేరతా నాలుగింటి బస్సుకి" అని లేచింది.

" అ అంటే అపరాధం వు అంటే వుపరాధం అన్నట్టు నేనేమన్నానని అంత కోపం.. వుండవే" అని నాయనమ్మ బతిమలాడినా వినలేదు.

“రాజమ్మా వుండు”” అంటా నేను వెనకాలే పరిగెట్టాను. మా నాయనమ్మ మీద చాలా కోపం వచ్చింది.

రాజమ్మ కళ్లను పైట తో మాటిమాటికీ తుడుచుకుంటూనే వుంది.

నాకూ ఏడుపు వచ్చింది. "రాజమ్మా ! ఇంటికి వెళ్దాం రా" అని బతిమాలాను.

ఇంతలో బస్సు రానే వచ్చింది. రాజమ్మ బస్సు ఎక్కి, సంచి మెట్టు మీద పెట్టి, టికెట్ కోసం పర్స్ తీసే డబ్బులు ఇస్తాంది. ఈ లోగా నేను చటుక్కున సంచిలో పైన పెట్టిన పాలపిట్టరంగు చీర తీసి చేతిలో పెట్టుకున్నాను. సంచి బస్సులో పెట్టుకుని "అమ్మదూ వెళ్లొస్తా! " అని చెబుతూ నా చేతిలో వున్న చీర చూసింది. అప్పటికే బస్సు కదులుతాంది..

" రాజమ్మా నాయనమ్మకు నచ్చకపోతే పోనీ , ఈ చీర నాకు చాలా నచ్చింది ... పెద్దయ్యాకా నీకు బోల్డు డబ్బులిస్తా " అంటా అరిచాను.

రాజమ్మ బదులుగా ఏమందో వినలేదు గానీ... ఆ కళ్లనిండా నా మీద ప్రేమ కనిపించింది .

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

**COMMENTS**